ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

9న ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాల ప్రదానం

పాలమూరు, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల భర్తీకి చేపట్టిన 2008, 2024 డీఎస్సీల అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఘట్టం శనివారం ముగిసింది. డీఎస్సీ-2024 విజేతలకు ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో అతి తక్కువ పోస్టులు ఉండటంతో అందులో మొదటి ర్యాంకు సాధించిన వారికే ఉద్యోగాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎక్కువ పోస్టులు ఉన్న కొన్ని విభాగాల్లో అధిక మార్కులు సాధించిన వారే విజేతలు కానున్నారు. డీఎస్సీ-2008 విజేతలకు ఎప్పుడు పోస్టులు కేటాయిస్తారో స్పష్టత రాలేదు. తాత్కాలిక పద్ధతిపై వారిని ప్రభుత్వ పాఠశాలల్లో భర్తీ చేయనున్నారు. డీఎస్సీ-2024 ప్రక్రియ పూర్తి కాగానే 2008 డీఎస్సీ అభ్యర్థుల నియమకాలపై దృష్టిపెట్టే అవకాశముంది.



డైట్‌లో డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన వివరాలను తెలుసుకుంటున్న డీఈవో రవీందర్

552 మంది హాజరు : డీఎస్సీ-2024లో 243 ఉపాధ్యాయ పోస్టులే ఉన్నాయి. వాటి కోసం 1:3 నిష్పత్తిలో 729 మందిని ఎంపిక చేయాల్సి ఉండగా.. కొన్ని విభాగాల్లో అర్హులు లేక 576 మందితో మెరిట్ జాబితా తయారు చేశారు. ఈ నెల 2 నుంచి జిల్లా కేంద్రంలోని డైట్‌లో అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం గడువు ముగిసేసరికి 552 మంది హాజరయ్యారు. మరో 24 మంది హాజరుకాలేదు. పోస్టులు వస్తాయన్న నమ్మకం లేనివారే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకానట్లు తెలుస్తోంది.

సగానికి పైగా రాలే..

డీఎస్సీ-2008లో ఎంపికైన 361 అభ్యర్థుల్లో సగం మంది ధ్రువపత్రాల పరిశీలనకు రాలేదు. గత నెల 29 నుంచి మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలన చేపట్టారు. 16 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అభ్యర్థులకు అవకాశం కల్పించింది. చాలా మంది ఇప్పటికే వివిధ కొలువుల్లో చేరిపోయారు. ఇప్పుడు తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగంలో చేరేందుకు చాలా మంది ఆసక్తి చూపటం లేదు. 361 మందిలో శనివారం గడువు ముగిసేసరికి 175 మందే హాజరయ్యారు. ఇంకా 186 మంది హాజరు కాలేదు. ధ్రువపత్రాలను పరిశీలించి వివరాలను పాఠశాల విద్య శాఖ సంచాలకులకు నివేదించినట్లు డీఈవో రవీందర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత 2008 డీఎస్సీలో ఎంపికైన వారికి నియామక పత్రాలను అందచేస్తామని పేర్కొన్నారు.

8 నుంచి సదరం శిబిరాలు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఈ నెల 8 నుంచి 30వ తేదీ వరకు సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి(డీఆర్డీవో) పి.నర్సింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో స్లాట్ బుక్ చేసుకున్న కొత్త వారికే ఈ నెలలో శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. స్లాట్ బుకింగ్‌లో సూచించిన తేదీల్లో స్లాట్ రశీదు, మెడికల్ రిపోర్టు, ఆధార్ కార్డులో దివ్యాంగులు శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుందన్నారు. శిబిరాలు ఈనెల 8, 9, 10, 15, 16, 17, 22, 23, 24, 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు డీఆర్డీవో వివరించారు.

చంద్రఘంటాదేవిగా జోగులాంబ



అలంకరణలో జోగులాంబ

అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అలంపూర్ ఆలయాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు జోగులాంబ భక్తులకు చంద్రఘంటాదేవి అలంకరణలో నేత్రపర్వంగా దర్శన భాగ్యం కల్పించారు. ఆలయా దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారికి అభిషేకం, స్పర్శదర్శనం, జోగులాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు.

అన్నపూర్ణదేవిగా మైసమ్మ దేవత



నవాబ్‌పేట, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాకర్లపహాడ్ గ్రామ సమీపంలోని పర్వతాపురం మైసమ్మ దేవతకు ఆలయ అర్చకులు శనివారం అన్నపూర్ణదేవీగా అలంకరణ చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతులు ఇచ్చి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు.

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయండి : కలెక్టర్



బ్రహ్మోత్సవాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఈనెల 31 నుంచి నవంబరు 18వ తేదీ వరకు చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలోని శ్రీకురుమూర్తిస్వామి వారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి అధికారులను ఆదేశించారు. శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. 31న బ్రహ్మోత్సవాల ప్రారంభం, నవంబరు 2న స్వామివారి కల్యాణం, 6న అమ్మాపూర్‌లో కురుమూర్తిస్వామి స్వర్ణ ఆభరణాలకు పూజ, 8న ఉద్దాల ఉత్సవం ఉంటాయని కలెక్టర్ తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం బందోబస్తు, రవాణా సౌకర్యం, వాహనాల పార్కింగ్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. 24 గంటల పాటు విద్యుత్తు సౌకర్యం, మరుగుదొడ్లు, భక్తులకు వైద్య సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత శ్రీకురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకే భక్తులు అధిక సంఖ్యలో వస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఏఎస్పీ రాములు, డీఆర్వో రవినాయక్, కురుమూర్తిస్వామి దేవాలయం ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొలాల్లో కాసుల పంట

నిబంధనలకు విరుద్ధంగా స్థిరాస్తి వ్యాపారం

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఓ గ్రామంలో ఒక గుంట స్థలానికి కూడా రిజిస్ట్రేషన్లు చేశారు. ఇక్కడ స్థిరాస్తి వ్యాపారానికి ఓ వ్యక్తి వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. నాలా(వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చే చట్టం) మార్చుకోకుండానే కడీలు పాతి ప్లాట్లుగా వేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అయినా గుంటల చొప్పున ఆ వెంచరు నిర్వాహకులు రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా పలువురికి ప్లాట్లను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మండలంలో వ్యవసాయ భూములకు ప్లాట్లుగా మార్చి గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామంలో 60 ఎకరాల్లో పెద్ద వెంచరు వేశారు. దీనిని నాలాగా మార్చలేదు. అయినా 121 చదరపు గజాల చొప్పున ప్లాట్లుగా మార్చి విక్రయానికి పెట్టారు. స్లాటు బుకింగ్ చేసుకుని ఒక్కొక్కరికి గుంట చొప్పున రిజిస్ట్రేషన్ చేశారు. వీరికి పట్టా పాసుపుస్తకాలూ వచ్చాయి. వాస్తవానికి ఇక్కడ వెంచరుగా అభివృద్ధి చేసిన నిర్వాహకులు వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్ చేశారు.



ఈనాడు, మహబూబ్‌నగర్-న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో పలు వ్యవసాయ భూములు వెంచర్లుగా మారుతున్నాయి. నాలాకు మార్చుకోకుండానే ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. డీటీసీపీ నుంచి అనుమతులు కూడా ఉండవు. స్థిరాస్తి వ్యాపారులు మాత్రం వ్యవసాయ భూములకు లేఅవుట్లు చేసి విక్రయిస్తున్నారు. సాధారణంగా వ్యవసాయేతర భూములకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయాలి. వ్యవసాయ భూములకు నాలా ధ్రువపత్రం లేకుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయడం కుదరదు. ఈ భూములకు రెవెన్యూ కార్యాలయాల్లోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తకుండా గుంటల్లో వీటికి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత..

పాలమూరులో కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లా కేంద్రాల సమీపంలో వ్యవసాయ భూములు వెంచర్లుగా మారాయి. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల, కొత్తకోట, పెబ్బేరు, ఎర్రవల్లి, ఇటిక్యాల, మానవపాడు, ఉండవల్లి మండలాల్లో పలుచోట్ల వ్యవసాయ భూములు వెంచర్లుగా మారాయి. కల్వకుర్తి నుంచి రాయచూరుకు వెళ్లే జాతీయ రహదారిలోని కల్వకుర్తి, మిడ్జిల్, మహబూబ్‌నగర్ అర్బన్, మహబూనగర్ గ్రామీణం, దేవరకద్ర, మరికల్, మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల్లోనూ వ్యవసాయ భూముల్లో పాట్లు వెలిశాయి. చాలాచోట్ల వీటిని వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడం లేదు. గుంటల పేరుతో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లను చేస్తున్నారు.

నిబంధనలు చెబుతున్నా..

వ్యవసాయ భూములకు గుంట నుంచి 10 గుంటల మధ్య స్లాటు బుక్ చేసి రిజిస్ట్రేషన్లకు రెవెన్యూ కార్యాలయాలకు వస్తే దీనిపై విచారణ జరిపించాలి. తండ్రి లేదా తల్లికి ఎకరా స్థలం ఉండి వారికి ఎక్కువ మంది సంతానం ఉంటే (కుటుంబ సభ్యులకు) మాత్రం రిజిస్ట్రేషన్లు చేయవచ్చు. సంబంధం లేని వ్యక్తులు నిత్యం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు స్లాటు బుక్ చేస్తే తహసీల్దార్‌కు అనుమానం రావాలి. ఈ సర్వే నంబరులో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. అక్కడ స్థిరాస్తి వ్యాపారాలు చేస్తున్నారా విచారణ చేయాలి. చాలాచోట్ల ఇవేమీ చేయడం లేదు. స్థిరాస్తి వ్యాపారమని తెలిసి కూడా వ్యవసాయ భూములకు గుంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఎకరాకు 40 గుంటలు ఉంటుంది.. ఒక గుంటకు 121 చదరపు గజాలు ఉంటాయి. ఇలా గుంటల్లో పాట్లుగా చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. దీనిపై మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ భూములను కుటుంబసభ్యులకు మినహాయించి ఇతరుల పేరు మీద ఐదు గుంటల వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదు. ఇతరుల పేరు మీద స్లాటు బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ల కోసం వస్తే తహసీల్దారు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.



టమాటా కిలో రూ.120

ఆత్మకూరు, న్యూస్‌టుడే: టమాటా ధర వినియోగదారులను బెంబేలెత్తిస్తోంది. గతంలో అన్ని కూరగాయల ధరలు రెక్కలొచ్చినా టమాటా ధర మాత్రం వినియోగదారుడికి కాస్త ఊరటనిచ్చే విధంగా ఉండేది. ప్రస్తుతం ఉన్నట్టుండి టమాటా ధర పలుకుతోంది. ఆత్మకూరులో కిలో రూ.120కి చేరింది. కర్నూల్, గద్వాల, శంషాబాద్ కూరగాయల మార్కెట్లలో కిలో రూ.వంద కొనసాగుతున్న పరిస్థితుల్లో రవాణా ఖర్చులను కలుపుకొని వ్యాపారులు కిలో రూ.120 విక్రయించాల్సిన పరిస్థితి ఉందని స్థానిక కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు.

12 సంఘాల్లోనే రూ.67.72 లక్షలు పక్కదారి

మిగతా 20 ఎస్‌హెచ్‌జీల వివరాల తనిఖీకి మరిన్ని రోజులు


న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : కోయనగర్ శ్రీసాయి మహిళా సంఘాల సమాఖ్యలో పొదుపు సొమ్ము భారీ స్థాయిలో దుర్వినియోగమైంది. మహిళల చిన్న సంఘాల బ్యాంకు ఖాతాలు, వ్యక్తిగత ఖాతాలు, తీర్మానాల పుస్తకాలు, స్త్రీనిధి డిమాండ్ నోటీసులు తనిఖీ చేస్తున్న కొద్దీ రూ.కోట్లలో సొమ్ము ఆర్పీ పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఆర్పీ అక్రమాలపై 'మహిళా సమాఖ్యలో భారీ కుంభకోణం' శీర్షికన 'ఈనాడు'లో శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. పురపాలక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో శనివారం రంగంలోకి దిగిన ముగ్గురు మెప్మా సీవోలు, మరో 15 మంది ఆర్పీలతో కూడిన మూడు తనిఖీ బృందాలు దొడ్డలోనిపల్లి రెవెన్యూ వార్డు భవనంలో విచారణ చేపట్టారు. స్త్రీనిధి బ్యాంకు ఏజీఎం వేణు గోపాల్‌రెడ్డి కూడా విచారణలో పాల్గొన్నారు. తొలిరోజు కేవలం 12 సంఘాల బ్యాంకు ఖాతాలు, తీర్మానాల పుస్తకాలు, స్త్రీనిధి డిమాండ్ నోటీసులు, ఆయా సంఘాల్లోని 120 మంది మహిళల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రూ.67.72 లక్షలు ఆర్పీ శ్రీలత సొంతానికి వాడుకున్నట్లు తేల్చారు. 12 సంఘాల్లోనే ఈ స్థాయిలో దుర్వినియోగం బయట పడటంతో తనిఖీ బృందాలు విస్తుపోయాయి. ఇంకా 20 సంఘాలు, వాటిలోని 210 మంది మహిళల ఖాతాలు తనిఖీ చేస్తే ఇంకే స్థాయిలో అక్రమాలు జరిగాయో తెలిసే అవకాశం ఉంది. కోయనగర్ శ్రీసాయి మహిళా సంఘాల సమాఖ్యలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణకు కనీసం వారం రోజుల సమయం పట్టే అవకాశముంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏకబిగిన సాగిన విచారణలో 12 సంఘాల వివరాలే పూర్తయ్యాయి. తమ సమాఖ్యలో ఆర్పీ పొదుపు సొమ్ము, రుణాల డబ్బు దుర్వినియోగం చేసినట్లు తెలియడంతో సంఘాల్లో సభ్యులుగా ఉన్న చాలా మంది మహిళలు శనివారం గుంపులుగా వార్డు కార్యాలయానికి చేరుకున్నారు. తమ ఖాతాలను కూడా తనిఖీ చేయాలని పట్టుబట్టారు. మెప్మా డీఎంసీ శివకుమార్ పర్యవేక్షణలో తనిఖీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిరోజు రూ.67.72 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు తేలిందని, ఇంకా 20 సంఘాలను తనిఖీ చేయాల్సి ఉందని వివరించారు. తొలిరోజు గుర్తించిన అంశాలను కమిషనర్‌కు నివేదించామని తెలిపారు.



కోయనగర్ ఎస్‌ఎల్‌ఎఫ్‌లోని మహిళల బ్యాంకు ఖాతాలు, తీర్మానాల పుస్తకాలు తనిఖీ చేస్తున్న ఆర్పీల బృందం



దొడ్డలోనిపల్లి వార్డు కార్యాలయం ఎదుట ఖాతాలు తనిఖీ చేయించుకునేందుకు వచ్చిన మహిళా సంఘాల సభ్యులు



ప్రకృతి సోయగం.. ముగ్ధ మనోహరం

వనపర్తి సమీపంలో తిరుమలయ్య గుట్టపై తిరుమలనాథుడు కొలువై ఉన్నాడు. గుట్టపై నుంచి చూస్తే ఆకుపచ్చని పర్వత శిఖరాలు కనువిందు చేస్తుంటాయి. ఆహ్లాదకర వాతావరణం.. ప్రకృతి చూపరులను కట్టిపడేస్తుంది. కృష్ణానది పరివాహక ప్రాంతం, పానగల్ కోట, పాము ఆకారంలో వంపులు తిరిగిన రహదారి మార్గం.. ఇలా ఎన్నో మనోహర దృశ్యాలు మైమరిపిస్తాయి.

- న్యూస్‌టుడే, వనపర్తి పట్టణం

ముస్లింల హక్కులు కాలరాసేలా చట్టాలు చేయొద్దు

తంజీమే ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ అజీజ్ పాషా



ప్రసంగిస్తున్న తంజీమే ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ అజీజ్ పాషా

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : ముస్లింల హక్కులను కాలరాసే చట్టాలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని తంజీమే ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ అజీజ్ పాషా అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన తంజీమే ఇన్సాఫ్ జాతీయ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో రైల్వే, రక్షణ శాఖల తర్వాత అత్యధిక ఆస్తి ఉన్నది వక్ఫ్‌బోర్డుకేనని, ఇది మోదీ ప్రభుత్వం మైనారిటీలను అణగదొక్కేందుకు కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. వక్ఫ్ చట్టం సవరణ విషయంలో లౌకిక, ప్రజాస్వామికవాదులంతా కలసి కట్టుగా కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో 14 శాతం ఉన్న మైనారిటీలకు 30 శాతం ఆస్తులు ఎందుకనే ఈర్ష్యతో ఈ చట్టాన్ని మార్చేందుకు బిల్లు తీసుకువచ్చారని విమర్శించారు. ప్రధాని మోదీ తప్పుడు విధానాలతో దేశంలో మతసామరస్యం దెబ్బతింటోందన్నారు. రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ మైనారిటీల ఆస్తులను హరించేలా కేంద్రం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇండియా కూటమి నేతలంతా ఏకమై దీన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మైనారిటీల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. సమావేశంలో అఖిల భారత తంజీమే ఇన్సాఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డా.అయూబ్ అలీ ఖాన్, అలీగఢ్ వర్సిటీ మాజీ ఉప కులపతి అహ్మద్ షర్వాణీ, నాయకులు ఇర్ఫాన్, ఇస్లాముద్దీన్, షకీబ్ ఉర్ రహమాన్, నవాబ్, నూరి నిసార్, ఫయాజ్, మునీర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు పి.సురేశ్, డి.రాము, రాజు, శంకర్, సత్యనారాయణరెడ్డి, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల కష్టాలు తీరేనా?



పెబ్బేరులో గోదాం ముందున్న ఖాళీ స్థలంలో ఆరబోసిన ధాన్యం

పెబ్బేరు, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. గత ఏడాది కేంద్రాలలో టార్పాలిన్లు అందించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల సమస్యలు, వారి ఇబ్బందులను ఎలా అధిగమించాలనే విషయంపై ప్రస్తుతం అధికారుల్లో స్పష్టత కనిపించడం లేదు. కేవలం ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుంది, కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేయాలి.. సన్నరకాలను సూక్ష్మ మీటర్ ఉపయోగించి చడాలనే విషయాలపై దృష్టి సారించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 827 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధం చేశారు.

జిల్లా	దిగుబడి అంచనా (మెట్రిక్‌టన్నుల్లో)	కొనుగోలు కేంద్రాలు
వనపర్తి	4 లక్షలు	244
నాగర్‌కర్నూల్	2.18 "	244
నారాయణపేట	3.52 "	95
గద్వాల	లక్ష	55
మహబూబ్‌నగర్	1.99 లక్షలు	189

వీటిపై దృష్టి సారించండి.. ● గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థల సమస్య వేధిస్తోంది. అరకొరగా ఉన్న స్థలంలో ధాన్యం ఆరబోసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులపై ధాన్యం ఆరబెడుతుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ● గతంలో ధాన్యం తడిసిపోవడంతో టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అందించలేదు. వీటిని మార్కెటింగ్ అధికారులు కేంద్రాలకు సరఫరా చేయడం లేదు. ● గోనె సంచులు, లారీల సమస్య ఏటా వేధిస్తోంది. ధాన్యం కొనుగోళ్లకు సరిపడా గోనె సంచులు [illegible] ● లారీల కొరత కారణంగా కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించకపోవడంతో వర్షాలకు తడుస్తున్నాయి. తడిసిన ధాన్యం మిల్లర్లు తిరస్కరించిన సంఘటనలు ఉన్నాయి. ● కొనుగోలు కేంద్రాల్లో జీవో ప్రకారం [illegible] ఒకరిద్దరితో కొనుగోళ్లు చేస్తుండటంతో ఆలస్యం జరుగుతోంది. కొన్ని చోట్ల బస్తాలు భారీగా చోరీ గురవుతున్నాయి. గోదాముల్లో వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్లకు చెందిన వ్యక్తులు వీటిని చోరీ చేసి బాదేపల్లి మార్కెట్ యార్డులో విక్రయించినట్లు పెబ్బేరు పోలీసుల విచారణలో తేలింది. ● వనపర్తి జిల్లాలో 700 బస్తాలకు పైగా చోరీ అయ్యాయి. ఇలాంటి చోరీ సంఘటనలు చాలా ఉన్నాయి. కేంద్రాల నిర్వాహకులు ధాన్యానికి భద్రత కల్పించలేక పోతున్నారు. నష్టాలన్ని రైతులే భరిస్తున్నారు.

ఇబ్బందులు కాకుండా చర్యలు : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. వనపర్తి జిల్లాలో 3,500 టార్పాలిన్లు అవసరం ఉన్నాయని, వాటిని కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని కోరాం. లారీల కొరత లేకుండా జిల్లాలో 7 సెక్టార్లను ఏర్పాటు చేసి ఒక్కో సెక్టార్‌కు 40 చొప్పున 280 లారీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం 25 లక్షల గోనె సంచులు ఉన్నాయి. ఇంకా 75 లక్షల సంచులకు పైగా అవసరం ఉంది. వాటిని తెప్పిస్తున్నాం. ధాన్యం చోరీ కాకుండా కేంద్రాల వద్ద గస్తీకి పోలీసులను కేటాయించాలని ఎస్పీని కోరాం.

-ఇర్ఫాన్, పౌరసరఫరాల సంస్థ డీఎం, వనపర్తి

రెజ్లింగ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



మహబూబ్‌నగర్ జట్టుకు బహుమతిని అందజేస్తున్న డీవైఎస్‌వో వెంకటేశ్ గుప్తా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు తదితరులు

ధన్వాడ, న్యూస్‌టుడే: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని నారాయణపేట డీవైఎస్‌వో వెంకటేశ్ గుప్తా అన్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలు శనివారం ముగిశాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు మాటాడారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అండర్ 14 విభాగంలో 30 కిలోలకు సంబంధించి నందిని (మహబూబ్‌నగర్), 33 కిలోల విభాగంలో నిఖిత (మహబూబ్‌నగర్), 36 కిలోల విభాగంలో సీతామహాలక్ష్మి (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. 39 కిలోల విభాగంలో శిరీష (మహబూబ్‌నగర్), 42 కిలోల విభాగంలో ప్రియమణి (మహబూబ్‌నగర్), 46 కిలోల విభాగంలో మౌనిక (మహబూబ్‌నగర్), 62 కిలోల విభాగంలో నైతిక (ఆదిలాబాద్), కీర్తి (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. 69 కిలోల విభాగంలో శివరంజని (మహబూబ్‌నగర్), శ్రుతి (కరీంనగర్), 73 కిలోల విభాగంలో సింధు (నిజామాబాద్), సఫూరాలు (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 50 కిలోల విభాగంలో రజిత (మహబూబ్‌నగర్), అక్షయ (మెదక్), మొదటి స్థానం సాధించిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

అండర్-19 క్రికెట్ పోటీల రన్నర్స్‌గా పాలమూరు



రన్నరప్ ట్రోఫీతో జిల్లా క్రికెటర్లు, ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఫైనల్‌లో కరీంనగర్ చేతిలో 2 వికెట్ల తేడాతో ఓడి రెండో స్థానం దక్కించుకుంది. శనివారం వరంగల్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించిన తుది పోరులో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. షాదాబ్ అహ్మద్ 89 (99 బంతుల్లో 4×11, 6×3), అబ్దుల్ రాఫె 48, అంకిత్ రాయ్ 31 పరుగులు చేశారు. అనంతరం కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసి విజయం సాధించింది. జిల్లా జట్టు నుంచి ముతీబ్ 3, షాదాబ్ 2, శశాంక్ 1 వికెట్ తీశారు. రన్నర్స్‌గా నిలిచిన పాలమూరు జట్టుకు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి శ్రీనివాస్, మహబూబ్‌నగర్ క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రాజశేఖర్ ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం సభ్యులు ఉదయ్ భాను రావు, ప్రదీప్, అబ్దుల్లా, శివశంకర్ తదితరులు హాజరయ్యారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



విజేత మహబూబ్‌నగర్ జట్టుతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు తదితరులు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడా సామర్థ్యం పెంపొందించుకోవడంతో ఉపాధితో పాటు దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంపొందించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్ కుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు కోస్గిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు, అనంతరం బాలికల విభాగంలో ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్ పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ తదితరులున్నారు.

చుట్టేద్దాం.. చూసొద్దాం

తెలంగాణ దర్శినికి సర్కారు శ్రీకారం

3వేల మంది పాలమూరు విద్యార్థులకు అవకాశం

అచ్చంపేట, న్యూస్‌టుడే : విరిసే ఉత్సాహం.. కొత్త ప్రాంతాలు పర్యటించాలన్న ఆసక్తి మెండుగా ఉన్న విద్యార్థులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి విద్యార్థులకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. ‘తెలంగాణ దర్శిని’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాఠశాల స్థాయిలో రెండో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రభుత్వం రూ. 12.10 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ఈ పథకం కింద చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.

ఉమ్మడి జిల్లాకు రూ. 36 లక్షలు..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య నిధులను త్వరలో ఖరారు చేయనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సుమారు 3 వేల మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు రూ. 36 లక్షలు కేటాయించే అవకాశం ఉంది.



క్షేత్ర పర్యటనలో ఉమామహేశ్వర క్షేత్రం వద్ద విద్యార్థులు

దసరా తర్వాత..

విద్యార్థులను విహార యాత్రకు తీసుకెళ్లే క్రమంలో వారికి అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఎకో టూరిజం, ఆర్ట్, క్రాఫ్ట్, వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దసరా సెలవుల తరువాత ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

తరగతుల వారీగా వివరాలు

విభాగం	తరగతులు	రోజులు	దూరం (కి.మీ.లలో)	ఒక్కో విద్యార్థికి ఖర్చు (రూ.లలో)
ఒకటి	2-4	ఒక రోజు	స్థానికం (మండల పరిధి)	300
రెండు	5-8	ఒక రోజు	20-30	800
మూడు	9-ఇంటర్	రెండు రోజులు	50-70	2,000
నాలుగు	డిగ్రీ	నాలుగు రోజులు	రాష్ట్రం	4,000

తరగతుల వారీగా విభాగాలు

విద్యార్థులు చదువుతున్న తరగతులను పరిగణనలోకి తీసుకొని నాలుగు విభాగాలుగా విభజించారు. మొదటి విభాగంలో 2-4 తరగతుల విద్యార్థులను గ్రామం లేదా మండల పరిధిలోని స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, ఉద్యానాలను సందర్శించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలి. రెండో విభాగంలో 5-8 తరగతుల విద్యార్థులను 20 కిలోమీటర్ల నుంచి 30 కి.మీ. పరిధిలోని ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పించారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు 50-70 కి.మీ. పరిధిలో ఉన్న ప్రదేశాలను రెండు రోజుల పాటు సందర్శించవచ్చు. డిగ్రీ విద్యార్థులు నాలుగు రోజుల పాటు పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సొంత జిల్లా వెలుపల లేదా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా పర్యటించి పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు అవకాశం కల్పించారు.

వారసత్వ సంపద కాపాడుకుందాం..

తెలంగాణ దర్శిని కార్యక్రమం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించనుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోనున్నారు. వారసత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని విద్యార్థులు పర్యాటక ప్రదేశాలు సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నాం.

-డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూలు

రామ రామ ఉయ్యాలో..!



పాలమూరు రెడ్డిసేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ పట్టణం బీకేరెడ్డికాలనీలోని రెడ్డి బాలికల వసతిగృహంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సతీమణి లక్ష్మీప్రసన్న, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, మహిళా విభాగం ప్రతినిధులు వేడుకల్లో పాల్గొని బతుకమ్మలకు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు.

- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం

ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ: విమలక్క



బతుకమ్మతో విమలక్క

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : ప్రకృతి, స్త్రీలను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని ప్రజా గాయకురాలు విమలక్క అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం చెన్నారంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలు, చిన్నారులతో కలిసి బహుజన బతుకమ్మ వేశారు. నల్లమల ప్రాంతంలో 2014కు ముందు యురేనియం తవ్వకాలకు నిరసనగా ప్రజా ఉద్యమాలు చేసినట్లు గుర్తుచేశారు. రామగుండాన్ని కాపాడుకోవడం కోసం నిర్వహిస్తున్న ఈ బహుజన బతుకమ్మ తిరిగి 6వ తేదీన రామగుండం వెళ్తుందన్నారు. స్త్రీల హక్కులు, మద్యం నిషేధం, కుల నిర్మూళన, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. బహుజన బతుకమ్మను గ్రామ గ్రామాన జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాశన్నయాదవ్, పరమేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్.. అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం.. ఒకరి దుర్మరణం

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు వద్ద జాతీయ రహదారి-44పై ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటలకు రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి(45) అక్కడికక్కడే మృతిచెందగా మరో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఉత్తరాది నుంచి ఇక్కడికి పనికి వచ్చిన ఇద్దరు కార్మికులు



మృతదేహాన్ని వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

మరొకరి పరిస్థితి విషమం

ఫ్లైఓవర్‌పై నుంచి నడుస్తూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అందులో ఒకరు మృతిచెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన వృద్ధుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడు, క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేస్తామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

సీఎం స్వగ్రామంలో ఏర్పాట్లు



కొండారెడ్డిపల్లిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎం ఓఎస్డీ చక్రవర్తిరెడ్డి, సీఎం సోదరుడు కృష్ణారెడ్డి

వంగూరు, న్యూస్‌టుడే : దసరా పండగకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి రానుండటంతో జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం ఓఎస్డీ చక్రవర్తిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం, ఏఎస్పీ రామేశ్వర్, ఏఆర్ ఏఎస్పీ భరత్, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి తదితరులు శనివారం కొండారెడ్డిపల్లిని సందర్శించి మాట్లాడారు. సీఎం ప్రారంభించనున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సౌర ప్రాజెక్టులో భాగంగా సౌర పలకలను రెడ్‌కో, విద్యుత్తుశాఖాధికారులు వేగవంతంగా ఏర్పాటు చేయాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున అధికారులు యుద్ధప్రాతిపాదికన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం సీఎం నివాసంలో సమావేశమై సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాట్లకు ప్రణాళిక రూపొందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ చిన్నఓబులేశ్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై మహేందర్, పంచాయతీరాజ్ డీఈ చంద్రకళ, ఏఈ మహిపాల్‌నాయక్, ఎంపీడీవో విజయభాస్కర్, ఏవో తనూజరాజ్, నాయకులు వేమారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకల్లో సీఎం సతీమణి



ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను మూడో రోజు కనుల పండువగా కొనసాగాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భార్య గీతారెడ్డి హాజరయ్యారు. ఆలయకమిటీ అధ్యక్షుడు రమేష్‌బాబు, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఆమె ఆలయ అభివృద్ధికి రూ. లక్ష నగదు విరాళం అందజేశారు.

ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

వంగూరు, న్యూస్‌టుడే : వచ్చే నెల నవంబర్ 20లోపు ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి అన్నారు. సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో రూ. 2కోట్లతో నిర్మిస్తున్న అంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సీఎం స్వయంగా రూ. 2కోట్లు వెచ్చించి ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేపట్టారని, అందుకోసమే నాణ్యతగా పనులు చేయించాలని గుత్తేదారుని కోరారు. నవంబర్‌లో విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈ కార్యక్రమానికి సీఎం హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీఎం సోదరి సుమతమ్మ, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, నాయకులు వేమారెడ్డి, పండిత్‌రావు, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మహబూబ్‌నగర్ : 9948145978 | జడ్చర్ల : 8008573899
దేవరకద్ర : 9000031648 | భూత్పూర్ : 8008563143



సమస్య : వెంకట్‌రెడ్డిపల్లి గేట్ పెట్రోల్ పంపు సమీపంలో ధర్మాపూర్‌కు వెళ్లే మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో కాలనీలోని ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక్కడ పైపులైన్‌కు తరచూ లీకేజీ ఏర్పడుతోంది.

– గోపాల్, కాలనీవాసి, వెంకట్‌రెడ్డిపల్లి గేట్

సమాధానం : సిబ్బందిని పంపించి లీకేజీ సరిచేయించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– రామకృష్ణ, మిషన్ భగీరథ ఏఈ, మహమ్మదాబాద్.

– న్యూస్‌టుడే, మహమ్మదాబాద్

తెరపై ఈనాడు

బాలాజీ- **దేవర,** తిరుమల- **దేవర,** వెంకటేశ్వర- **దేవర**
వెంకటాద్రి - **సత్యం సుందరం**
శ్రీకృష్ణ- **జోకర్ (ఉదయం ఆటలు) దక్షిణ (రాత్రి ఆటలు)**
(– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం)

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

నవాబ్‌పేట : ఎన్మనగండ్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ మద్దిలేటి ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, బోటని సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్నట్లు, పీజీలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలని సూచించారు. ఈనెల 14, 15వ తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గణిత ఉపాధ్యాయుడికి సన్మానం

పాలమూరు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ పట్టణం రాజేంద్రనగర్‌లోని న్యూరిషి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.గోపాల్ డీఎస్సీ-2024లో గణితం స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్మన్ చంద్రకళ వెంకటయ్య, డైరెక్టర్లు సాయిసుశాంత్ కృష్ణ, పూజిత మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్ తదితరులు గోపాల్‌ను సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపల్ వెంకటరమణ, సహ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పక్కాగా చేయండి

జడ్చర్ల: కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర శివేంద్ర ప్రతాప్ సూచించారు. శనివారం ఆయన జడ్చర్ల పట్టణం 24వ వార్డులో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. పట్టణంలో ఉండే కొంత మంది స్వగ్రామాల్లో వివరాలు నమోదు చేసుకుంటామని చెబుతున్నారని సిబ్బంది పేర్కొన్నారు. సాయంత్రం వరకు 24వ వార్డులోని అన్ని ఇళ్ల సర్వే పూర్తి చేసినట్లు పుర కమిషనర్ రాజయ్య తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి తదితరులు తెలిపారు. పురపాలికలోని వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కావటం లేదని స్థానికులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరించాలని ఈఈకి సూచించారు. సర్వేలో ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

ఘనంగా కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి జయంతి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, యువజన క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, డీఆర్‌డీవో నరసింహులు, పౌరసరఫరాల అధికారి వెంకటేశ్, జిల్లా సంక్షేమాధికారి జరీనా బేగం, డీపీఆర్వో శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ అధికారి బాబు, కలెక్టరేట్ ఏవో శంకర్ పాల్గొన్నారు.

ఆలయానికి వంటపాత్రల వితరణ

అడ్డాకుల : మూసాపేటలోని శ్రీశివమారుతి రామాలయానికి ఆలయ కమిటీ ఛైర్మన్ రామచంద్రయ్య దంపతులు రూ.50వేల విలువైన వంటపాత్రలను వితరణ చేశారు. కమిటీ సభ్యులు సుధాకరాచారి, ఆంజనేయులు, నల్ల తిరుపతయ్య గౌడ్, గడ్డం మహేందర్, కొండయ్య, మధు పాల్గొన్నారు.

9న ఎమ్మార్పీఎస్ ప్రదర్శన

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్): ఈనెల 9న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పాలమూరు పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ఈ సంఘం నాయకులు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్ నాయకులు శ్రీరాములు, టి.రాజు, కేశవులు, సురేశ్, రాంచందర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోండి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డా.రియాజ్ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ పట్టణం రాంనగర్‌లోని పిల్లలు, మహిళల గ్రంథాలయాన్ని సందర్శించారు. పుస్తకాలు అందించిన కవి డా.భీంపల్లి శ్రీకాంత్‌ను అభినందించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, గ్రంథాలయ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్: బ్రాహ్మణవాడ వాసవీమాత ఆలయంలో అన్నపూర్ణాదేవిగా.. వీరన్నపేట చౌడేశ్వరీమాత ఆలయంలో.. శ్రీనివాస కాలనీలోని వాసవీమాత ఆలయంలో.. రవీంద్రనగర్‌లోని పోచమ్మ దేవాలయంలో.. పద్మావతికాలనీ కాళికాదేవి ఆలయంలో.. జడ్చర్ల : కన్యకాపరమేశ్వరి ఆలయంలో.. భూత్పూర్ : అమిస్తాపూర్ జ్ఞాన సరస్వతి ఆలయంలో.. దేవరకద్ర: లక్ష్మీపల్లిలో అమ్మవారు.. కోయిలకొండ: అంకిళ్లలో.. శేరివెంకటపూర్‌లో..

చల్లని తల్లి.. కల్పవల్లి!



భూత్పూర్ : సతీమణి జ్యోతితో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



బ్రాహ్మణవాడ వాసవీమాత ఆలయంలో మహిళల కుంకుమార్చన

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్తులు జగన్మాతకు జేజేలు పలుకుతున్నారు. మూడోరోజు శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వీరన్నపేటలోని శ్రీచౌడేశ్వరిమాత ఆలయంలో పంచముఖాలతో గాయత్రిమాతగా అలంకరించారు. బ్రాహ్మణవాడలోని వాసవీమాత ఆలయంలో, రవీంద్రనగర్‌లోని పోచమ్మదేవి ఆలయాల్లో అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. శ్రీనివాసకాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అమ్మవారి వద్ద ఎంపీ డీకే అరుణ పూజలు చేశారు. వేంకటేశ్వర, లక్ష్మీనగర్‌కాలనీలోని శ్రీరాజరాజేశ్వరిమాత ఆలయాన్ని పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ దర్శించారు. జడ్చర్ల కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో, రాంమందిర్‌లో మర్వాడీ సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చూడముచ్చటగా కొనసాగుతున్నాయి. అమిస్తాపూర్‌లోని జ్ఞాన సరస్వతి దేవాలయంలో శాకాంబరి మాతగా దర్శనమిచ్చారు. భూత్పూర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి కవితతో కలిసి హాజరై బతుకమ్మ ఆడారు. మౌలిక వసతులు, తరగతి గదుల్లో సామగ్రి, విద్యార్థులకు డ్యూయల్ డెస్కులు సమకూర్చాలని కోరగా దసరా సెలవుల తర్వాత ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దేవరకద్రలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కళాశాల విద్యార్థినులు బతుకమ్మ ఆడారు. లక్ష్మీపల్లిలో శ్రీకనక దుర్గాదేవి దివ్యక్షేత్రంలో అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. ఉడిత్యాలలోని ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారిని భక్తులు ఊరేగించారు. మిడ్జిల్, కోయిలకొండ, మహమ్మదాబాద్, నవాబ్‌పేట, గండీడ్ తదితర మండలాల్లోని గ్రామాల్లో అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. – న్యూస్‌టుడే బృందం



మహబూబ్‌నగర్ : రాజరాజేశ్వరీమాత ఆలయంలో పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు



దేవరకద్ర : బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు





జడ్చర్ల : సకల దేవతల ఆలయంలో.. మిడ్జిల్ : పూజలు చేస్తున్న గ్రామస్థులు



దేవరకద్రలో అమ్మవారికి మహిళల హారతి



బాలానగర్: ఉడిత్యాలలో అన్నపూర్ణదేవీ ఊరేగింపు

సీనియర్ సిటిజన్ ఫోరం సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ పట్టణంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో చేపడుతున్న సమాజ హిత, చైతన్య కార్యక్రమాలు అభినందనీయమని సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. శనివారం మెట్టుగడ్డ పారిశ్రామిక వాడలోని ఫోరం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రుల పోషణ బాధ్యత కొడుకులకే కాకుండా కుమార్తెలకు కూడా ఉంటుందని వెల్లడించారు. అంతకుముందు పోలీస్ సురక్ష కళాబృందం రాములు, శివరాములు తదితరులు పాటలు ఆలపించి అలరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షకార్యదర్శులు జగపతిరావు, నస్కంటి నాగభూషణం, న్యాయవాది రాజేశ్, ప్రతినిధులు నారాయణరావు, రాజసింహుడు, చంద్రయ్య, సురేశ్‌బాబు, సిద్దిరామప్ప, ఎల్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యువతను భాగస్వామ్యం చేయండి : ఎంపీ



శ్రీనివాసకాలనీలో యువకుడికి భాజపా సభ్యత్వం అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : యువతకు సభ్యత్వాలు ఇచ్చి భాజపాలో భాగస్వాములను చేయాలని ఎంపీ డీకే.అరుణ పార్టీ నాయకులకు సూచించారు. శనివారం మహబూబ్‌నగర్ పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డు శ్రీనివాసకాలనీలో పలువురికి ఎంపీ భాజపా డిజిటల్ సభ్యత్వాలు అందజేశారు. చాలా మంది యువతీ యువకులు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం, ప్రధాని మోదీ పాలనపై సానుకూల దృక్పథంతో ఉన్నారని, వారిని భాజపా నాయకులు గుర్తించి కుటుంబ సభ్యులతో సహా అందరికీ సభ్యత్వం అందించాలని కోరారు. మహబూబ్‌నగర్ పట్టణం భాజపాకు పట్టున్న స్థానమని, పార్టీ సభ్యత్వాలతో రానున్న పురపాలక ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు అంజయ్య, రామాంజనేయులు, నాయకులు బురుజు రాజేందర్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, రమేశ్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, నారాయణయాదవ్, సుబ్రమణ్యం, మనోహర్ పాల్గొన్నారు.

కొడంగల్, బొంరాస్‌పేట: పంటలు పండించే భూముల్లో కాకుండా బీడు భూముల్లో (ఫార్మా) కంపెనీలు నెలకొల్పాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం దుద్యాల మండలం హకీంపేట వద్ద ఆమె రైతులను కలిసి మాట్లాడారు. ప్రజలు నమ్ముకొని ఓట్లు వేస్తే రైతుల భూములను లాక్కోవడం సరికాదన్నారు. వారికి అన్యాయం జరిగితే ఊరుకొనేది లేదని, రైతుల పక్షాన ఎంత దూరమైనా పోరాడతామని ఆమె తెలిపారు.

రహదారి విస్తరణకు సహకరించండి



పురపాలికలో దుకాణదారులతో సమావేశమై రహదారి విస్తరణపై అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ పట్టణం అశోక్ టాకీస్ క్లాక్‌టవర్ ప్రధాన రహదారి విస్తరణకు రహదారి పొడవునా దుకాణాలు కలిగిన వ్యాపారులు సహకరించాలని పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ జ్యోత్స్నాదేవి కోరారు. శనివారం పురపాలక కౌన్సిల్ హాలులో రహదారి విస్తరణపై పలువురు దుకాణదారులతో ఆమె సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. ప్రస్తుతం అశోక్ టాకీస్ కూడలి నుంచి క్లాక్‌టవర్ వరకు ప్రధాన రహదారి 60 అడుగుల విస్తీర్ణం ఉందని, రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ కారణంగా 80 నుంచి 100 అడుగులకు విస్తరించాల్సి ఉందని తెలిపారు. ఇందులో భాగంగా అశోక్ టాకీస్ కూడలిని విస్తరించారని, అక్కడి నుంచి క్లాక్‌టవర్ కూడలి వరకు డివైడర్‌తో కూడిన రెండు వరుసల రహదారి నిర్మాణం పనులు ముమ్మరం చేశామని, సమీప వ్యాపారులు 20 అడుగుల మేర సెట్‌బ్యాక్ తీసుకొని దుకాణాలు నిర్మించుకోవాలని సూచించారు. ఇందుకు వ్యాపారుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. 20 అడుగుల మేర సెట్‌బ్యాక్ అంటే దుకాణాలన్నీ తొలగించుకోవాల్సి వచ్చి తీవ్రంగా నష్టపోతామని, ఈ విషయంపై పునరాలోచించాలని కొందరు వ్యాపారులు కోరగా, మరికొందరు సెట్‌బ్యాక్ సగం తగ్గించాలని అభిప్రాయపడ్డారు. దుకాణదారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో మరోమారు అభిప్రాయ సేకరణకు పిలుస్తామని, అప్పటివరకు రహదారి విస్తరణకు వ్యాపారులంతా సహకరించాలని, పనులు మాత్రం ఆగవని ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో ప్రణాళిక విభాగం టీపీఎస్ విశాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యుత్తు శాఖ ఉద్యోగులు

విద్యుత్తు కేంద్రం ప్రైవేటీకరణకు కుట్ర

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రామగుండం థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్వహణ బాధ్యతలు ప్రైవేట్‌కు అప్పగించేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఆరోపించారు. శనివారం ఎస్ఈ కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. కేంద్రం వైఖరి మార్చుకుని ప్లాంట్‌ను జెన్‌కోకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు డి.చంద్రమౌళి, స్వామి, నవీన్, పాండు, చంద్రశేఖర్, సంతోష్, గంగాధర్, నారాయణ, బాబియానాయక్, బలరాం, ఉదయ్‌కుమార్, పెంటయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రగురుస్వామి ఆరాధన ఉత్సవాలు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : జిల్లాకేంద్రం వీరన్నపేటలోని పెద్దశివాలయం ప్రాంగణంలో చంద్రగురుస్వామి ఆరాధన సప్తాహ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భజనమండళ్లు పాల్గొని సామూహిక భజన పాటలతో అలరించారు. చంద్రగురుస్వామి భక్తమండలి ప్రతినిధులు శంకర్, పోతుల రాంరెడ్డి, బాగన్నగౌడ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

అమరులకు నివాళి

మహబూబ్‌నగర్ పట్టణం: డిమాండ్లు నెరవేర్చాలంటూ 55 రోజుల పాటు చేపట్టిన ఆర్టీసీ సమ్మెలో తెలంగాణ వ్యాప్తంగా 38 మంది కార్మికులు అమరులయ్యారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ అన్ని ఆర్టీసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 2 నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. శనివారం మహబూబ్‌నగర్ డిపో ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. 2013 బాండ్ సొమ్ము కార్మికులకు వెంటనే చెల్లించాలన్నారు. 2021 సంవత్సరానికి సంబంధించిన పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

దివిటిపల్లి రెండుపడక గదుల ఇళ్లకు దారి చూపండి

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: దివిటిపల్లి రెండు పడక గదుల ఇళ్లకు రైల్వే స్టేషన్ నుంచి దారి సరిచేయాలని సీఐటీయూ, దివిటిపల్లి డబుల్‌బెడ్‌రూం పోరాట వేదిక ఆధ్వర్యంలో రైల్వే పీసీవోఎం నాగ్యానాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. శనివారం రైల్వే స్టేషన్‌లో ఆయన్ను కలిసి సమస్యలు వివరించారు.

పెద్దచెరువు ఆక్రమణల బాధ్యులపై చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, న్యూస్‌టుడే : తాను ఆరోపించినట్లే బాలానగర్‌లోని పెద్దచెరువులో ఆక్రమణలు జరిగినట్లు అధికారుల విచారణలో తేలిందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆర్డీవో నవీన్‌తో పాటు మరో ముగ్గురు అధికారులతో కూడిన బృందం క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు సమర్పించినట్లు చెప్పారు. నివేదికలో 1.67 లక్షల టన్నుల మట్టిని అక్రమంగా తీసుకొచ్చి నాలాను పూడ్చి వేశారని, శ్మశాన వాటికను ధ్వంసం చేసి అక్కడ ఉన్న ప్రభుత్వ భూమికి నాలా ధ్రువీకరణ పత్రం పొందినట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారని తెలిపారు. ఈ అక్రమాలకు పాల్పడిన స్థిరాస్తి సంస్థకు సహకరించిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నాలా ధ్రువీకరణ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు.

రహదారి పనుల పరిశీలన

పాలమూరు పురపాలకం : పోస్టుమార్టం కూడలికి సమీపంలో టీచర్స్‌కాలనీ పార్కువైపు వెళ్లే మార్గంలో 100 అడుగుల మేర ఇరుకుగా ఉన్న రహదారి విస్తరణకు చర్యలు చేపట్టారు. పాత పోస్టుమార్టం ప్రహరీకి ఆనుకుని ఉన్న రెండు ఇళ్ల యజమానుల ఇళ్ల ప్రహరీలను తొలగించి రెండు అడుగుల మేర వెనక్కి నిర్మించుకునేలా పుర వైస్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్ ఒప్పించారు. అక్కడ ఇన్నాళ్లు ఇరుకుగా ఉన్న పోస్టుమార్టం రహదారి కాస్త విశాలంగా మారింది. ఇక్కడ ఇబ్బందికరంగా ఉన్న మురుగు కాల్వను భూగర్భ డ్రైనేజీగా మార్చే పనులు శనివారం వైస్ ఛైర్మన్ ప్రారంభించారు.

అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలెందుకు?

మహమ్మదాబాద్, గండీడ్, న్యూస్‌టుడే : అధికారిక కార్యక్రమాల్లో ఏ పదవీ లేని కాంగ్రెస్ నాయకులు ఎలా పాల్గొంటున్నారని జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, భారాస గండీడ్ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్ అన్నారు. శనివారం గండీడ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మహిళలకు రాయితీ సిలిండర్ పత్రాలను ఎలా పంపిణీ చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రుణమాఫీ కాక రైతులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు వెంకట్రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, రాములు, వెంకట్, రాజేశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణ ప్రాంగణంలో వృద్ధుడి మృతి.. కందనూలు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన కొమ్ము వెంకటయ్య (70) భార్య వెంకటమ్మతో కలిసి శనివారం సాయంత్రం తాడూరు మండల కేంద్రానికి బయలుదేరారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో కల్వకుర్తి బస్సు కోసం ఎదురుచూస్తుండగా వెంకటయ్య తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రయాణికులు సమాచారమివ్వడంతో 108 సిబ్బంది వచ్చి మృతి చెందినట్టు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు.

దాయదుల ఘర్షణ.. ఇరువర్గాలపై కేసు.. అడ్డాకుల, న్యూస్‌టుడే : పొలం విషయంలో దాయాదుల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు అడ్డాకుల ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అడ్డాకుల మండలం తిమ్మాయపల్లితండాకు చెందిన ముడావత్ రాగ్యా శుక్రవారం రాత్రి భోజనం చేసి కుటుంబంతో కలిసి ఇంటి ముందు ఉండగా అతడి దాయాది గిర్ని మణ్యం, కుటుంబ సభ్యులు కలిసి పొలం వద్ద మధ్యాహ్నం జరిగిన గొడవను ప్రస్తావిస్తూ ఘర్షణ పడ్డారు. శనివారం పరస్పరం ఫిర్యాదు చేసుకోగా కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వాహనం అదుపుతప్పి నలుగురికి గాయాలు.. బాలానగర్, న్యూస్‌టుడే : బాలానగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై బాలానగర్ నుంచి వెళ్తుండగా మార్గం మధ్యలో అదుపుతప్పి కిందపడ్డారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అడ్డాకుల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు గాయాలపాలైన ఘటన మూసాపేట వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జడ్చర్ల పట్టణానికి చెందిన అనిల్, శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై కొమిరెడ్డిపల్లి వద్ద ఉన్న ఓ హోటల్‌కు బయలుదేరారు. మూసాపేట వద్దకు చేరుకోగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకెళ్లింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానికులు 108 అంబులెన్సులో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టరు ఢీకొని ఇద్దరికి.. మిడ్జిల్, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన రైతు నారాయణ ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్తుండగా ట్రాక్టరు ఢీకొట్టింది. ప్రమాదంలో నారాయణతో పాటు కూలీ పనులకు వెళ్తున్న పద్మమ్మ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు నారాయణను 108 వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాగి తీగ చోరీ కేసులో నిందితుల రిమాండు.. అడ్డాకుల, న్యూస్‌టుడే : రాగి తీగ చోరీకి పాల్పడిన వారిని రిమాండుకు తరలించినట్లు అడ్డాకుల ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు. పొన్నకల్ శివారులోని సోలార్ ప్లాంటులో గురువారం రాత్రి జరిగిన రాగి తీగ చోరీపై ఫిర్యాదు రాగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్న హైదరాబాద్ నగరం దుండిగల్‌కు చెందిన పాత నేరస్థుడు రాజు, మహబూబ్‌నగర్ పట్టణం షాసాబ్‌గుట్టకు చెందిన ఫారుక్ సిద్దిఖీలు ఇద్దరు కలిసి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితులను శనివారం అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరచి రిమాండుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్, పొక్లెయిన్ పట్టివేత.. జడ్చర్ల, న్యూస్‌టుడే : అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, పొక్లెయిన్‌లను జడ్చర్ల పోలీసులు పట్టుకున్నారు. కిష్టారం గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా శనివారం రాత్రి సీఐ ఆదిరెడ్డి, సిబ్బంది పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిందితుడికి రిమాండ్ .. జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలోని ఓ మహిళను కొట్టి, బెదిరించి, అసభ్యంగా ప్రవర్తించిన జడ్చర్ల పట్టణం ఇందిరానగర్‌కు చెందిన బద్రి అనే వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈ వ్యక్తిపై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయి.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు.. మహబూబ్‌నగర్ నేరవిభాగం : జిల్లా కేంద్రంలోని ఓ వసతిగృహంలో ఉంటున్న బాలికను ఇద్దరు అన్నదమ్ములు వేధింపులకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఠాణా పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించనున్నారు.

మహిళ అదృశ్యం.. మహబూబ్‌నగర్ నేరవిభాగం : మహిళ అదృశ్యంపై రెండో పట్టణ ఠాణా పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని న్యూ ప్రేంనగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మమ్మ(60)కు కల్లు తాగే అలవాటు ఉంది. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె సాయంత్రమైనా తిరిగి రాలేదు. కంగారుపడిన కుమారుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.